


# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## సోమశిల నీటిమట్టం



అనంతసాగరం, ఆగస్టు17ప్రభాతవార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 24087క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో47.840టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50,ఎన్ఎఫ్‌సికి 340, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 95.905మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# బరితెగించిన గంజాయి స్మగ్లర్లు

తప్పించుకునేందుకు పోలీస్ వాహనాన్ని గుద్దే ప్రయత్నం..
కానిస్టేబుల్ కు గాయాలు
రెండు రౌండ్ల ఫైరింగ్ చేసిన సీఐ
స్మగ్లర్ అరెస్టు, 22 కిలోల గంజాయి స్వాధీనం





నెల్లూరు క్రైం, ఆగష్టు 17, ప్రభాతవార్త: గంజాయి స్మగ్లర్లు రోజురోజుకీ బరితెగిస్తున్నారు. గతంలో నెల్లూరు పరిధిలో జాతీయ రహదారిపై గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వాహనాన్ని అడ్డు కున్న డీఎస్పీని వాహనంతో గుద్ది తప్పించుకునే ప్రయత్నం చేసిన ఘటన మరువక ముందే మరో సారి అదే స్థాయిలో స్మగ్లర్లు బరితెగించారు. అయితే స్థానిక సీఐ సాంబశివరావు తక్షణమే స్పం దించి ఫైరింగ్ చేపట్టడంతో స్మగ్లర్ చేతులు పైకెత్తి పోలీసులకు సరెండర్ కావడం తప్ప మరో గత్యం తరం లేకపోయింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఈగల్ టీం ఐజి ఆర్ కే.రవికృష్ణ ఆదివారం నెల్లూరు నగర శివార్లలో సంఘటన జరిగిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. గంజాయిని సమూలంగా నిర్మూలించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం మేరకు ఎక్కడికక్కడ గంజాయి స్మగ్లర్ల పై ఈగల్ టీం తో పాటు స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుండి నెల్లూరులోని గంజాయి విక్రేతలకు గంజాయిని అందించేందుకు కొందరు కారులో బయలుదేరి వస్తున్నట్లు సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాలాజీ నగర్ సీఐ సాంబశివరావు, స్టేషన్ సిబ్బందితోపాటు ఈగల్ టీం సిబ్బందితో జాతీయ రహదారి పెన్నా వంతెన వద్ద నిఘా ఉంచారు. మారుతి స్విఫ్ట్ కారులో స్మగ్లర్ రావడాన్ని గమనించి కారును సీఐ తన సిబ్బందితో కలిసి వెంబడించారు. స్థానిక ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో ఉన్న అమ్మకం దారులకు గంజాయిని స్మగ్లర్ అందించే క్రమంలో సీఐ తమ వాహనాన్ని స్మగ్లర్ వాహనానికి అడ్డుగా పెట్టే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో దిక్కుతోచని స్మగ్లర్ తన వాహనంతో పోలీసు వాహనాన్ని గుద్దడంతోపాటు అడ్డు వచ్చిన కానిస్టేబుల్ ని కూడా తొక్కించే ప్రయత్నం చేశారు. అతన్ని నియంత్రించే ప్రయత్నం చేసిన కానిస్టే బుల్ ఫిరోజ్ కు ఈ సంఘటనలో ఈ గాయాలయ్యాయి. వెంటనే తేరుకున్న సీఐ తన సర్వీసు పిస్టల్ తో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో భయాందోళనకు గురైన స్మగ్లర్ పోలీసులకు లొంగిపోయాడు. రాజమండ్రి ప్రాంతానికి చెందిన బీరక ప్రకాష్ అలియాస్ సూర్యప్రకాష్ గత కొన్ని ఏళ్లుగా గంజాయి స్మగ్లింగ్ చేయడమే వృత్తిగా పెట్టుకున్నాడు. పలుసార్లు జైలుకు వెళ్లినప్పటికీ అతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు లేదు. తూర్పుగోదావరి పశ్చిమగోదావరి నెల్లూరు జిల్లాలోని పలు స్టేషన్లలో అతనిపై కేసులు నమో దై ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం కూడా స్మగ్లింగ్ చేస్తూ బాలాజీ నగర్ పోలీసులకు చిక్కాడు. ము ద్దాయి వద్ద నుండి 22 కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో గాయ పడిన కానిస్టేబుల్ ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పేరు మోసిన స్మగ్లర్ ను పట్టు కోవడంలో ప్రతిభ కనపరిచిన డీఎస్పీ సింధు ప్రియ, సీఐ సాంబశివరావు, ఇతర సిబ్బందిని ఈగల్ టీం ఐజి రవికృష్ణ, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ అభినందించారు.

**..కానిస్టేబుల్ ను పరామర్శించిన ఐజి..** గంజాయి స్మగ్లర్ ను పట్టుకునే ప్రయత్నంలో గాయాల పాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈగల్ టీం కానిస్టేబుల్ ఫిరోజ్ ను ఐజి రవికృష్ణ పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. స్మగ్లర్ ను పట్టుకోవడంలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించిన ఫిరోజ్ ను ఐజి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్పీ కృష్ణ కాంత్, ఏఎస్పి సిహెచ్ సౌజన్య, నగర డి.ఎస్.పి సింధు ప్రియ ఉన్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే



**కావలి, ఆగష్టు18ప్రభాతవార్త** కృష్ణాష్టమి సందర్భంగా కావలి పట్టణంలోని పాతూరులో బొంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గారు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణుని గ్రామోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.. అనంతరం కావలి రూరల్ మండలం అల్లిగుంట పాలెం గ్రామంలో జరిగిన పోలేరమ్మ తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గారు శనివారం రాత్రి పాల్గొన్నారు.. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు.

## గంజాయి స్మగ్లర్ దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఈగల్ టీమ్ కానిస్టేబుల్ పటాన్ ఫిరోజ్ ఆరోగ్య

### పరిస్థితిపై ఆరా తీసిన మంత్రి నారాయణ



నెల్లూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త –వైద్యం నెల్లూరులో గంజా యితో కారులో పారిపోయేందుకు ప్రయత్నించిన స్మగ్లర్ సూర్య ప్రకాష్‌ను అడ్డుకునే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడ్డ ఫిరోజ్. స్మగ్లర్ కారుతో ఢీకొట్టడంతో గాయపడ్డ కానిస్టేబుల్. కారును వెంబడించి చాకచక్యంగా స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్న సీఐ సాంబశివరావును కానిస్టేబుల్ ఫిరోజ్‌ను అభినందించిన మంత్రి. గంజాయి రవాణా, అమ్మకంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈగల్ టీమ్ ద్వారా రాష్ట్రాన్ని గంజాయి, మా దకద్రవ్యాల రహితంగా మారుస్తాం.

## పీజిఆర్ఎస్ అర్జీల పరిష్కార సమాచారం కోసం కాల్ సెంటర్ ఏర్పాటు

- 1100 నెంబర్‌కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు

- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 17, ప్రభాతవార్త** నెల్లూరు కలెక్టర్ కార్యాలయం, తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజనల్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100కు ఫోన్ చేయవచ్చుని అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏదశలో వుందో సమాచారం తెలుసు కోవటం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చుని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- 14 నెలల్లోనే సూపర్‌సిక్స్ పథకాల అమలు
- సొసైటీలు అన్నదాతలకు ఉత్తమ సేవలందించాలి
- రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయి





**ఇందుకూరుపేట, ఆగష్టు 17, ప్రభాతవార్త** అన్నం పెట్టే అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇందుకూరుపేటలో ఉన్న అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, డైరక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆమె పాల్గొ న్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ సొసైటీ చైర్మన్, డైరక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన వారు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని ఆమె అన్నారు. అమరేంద్రరెడ్డికి ఎలక్షన్ టైంలో మంచి పదవి ఇవ్వాలని ఆలోచించామని, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి అని, అందుకే సొసైటీ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవతో రైతుల ఖాతాలో నగదు జమ చేశారని,తల్లికి వందనం పథకాన్ని అమలు చేశాం న్నారు. ఇటీవల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి మాట నిలబెట్టుకున్నారని వెల్లడించారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు, ఆక్వా సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో రైతులకు చేపల మేతకు కూడా సొసైటీ అందిస్తుందని చెప్పారు. కొత్త చైర్మన్ రైతుల అవసరాలను దృష్టిలో రైతుల ప్రయోజనాలను కాపాడుతూ అభివృద్ధికి పాటుపడతారని ఆకాంక్షించారు.=దు వ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బ్యాం కు చైర్మన్ గండవరపు అమర్నాథ్‌రెడ్డి, డైరక్టర్ పెను బల్లి కృష్ణ చైతన్య, డైరక్టర్ శూదలగుంట ప్రేమలత, జడ్పీ వైస్ చైర్మన్ జయలక్ష్మీ, ఇందుకూరుపేట మండల అధ్యక్షుడు పవన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రావిళ్ళ వీరేంద్ర నాయుడు, చెంచు కిషోర్ యాదవ్, దేవిరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు నగరంలో

# ప్రైవేటు టౌన్ బస్సుల ఇష్టారాజ్యం, ప్రజలకు ప్రాణ సంకటం

- నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న బస్సులపై చర్యలేవీ..?
- టౌన్ సర్వీస్ బస్సులు బస్టాండ్లలో ఆపరా..?
- బస్సులు ఆపేది ఒకచోట బస్టాండ్లు మరోచోట
- కాలుష్య నియంత్రణకు వీళ్ళు అతీతులా..?
- నగరంలో తిరిగే అన్ని బస్సులకు ఎఫ్‌సీలు సరిగా ఉన్నాయా..?
- వీటి పొగతో ప్రజల ప్రాణాలు పోతున్నా ఆయా శాఖలకు పర్యవేక్షణ పట్టదా..?





**నెల్లూరుఅగ్రికల్చర్, ఆగష్టు 17,ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో ప్రైవేటు టౌన్ బస్సుల ఇష్టారాజ్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. నెల్లూరులోని ప్రతి కూడలిలో ట్రాఫిక్ రూల్స్ అంటూ ఏమీ లేవు. ఎందుకంటే అవి నిర్ధేశించిన బస్టాండ్లలో ఆగవు. ప్రయాణికులు ఎక్కడ చెయ్యెత్తినా అక్కడ ఆపేస్తారు. వెనకాల ఎన్ని వాహనాలు క్రమ పద్ధతిలో నడుస్తున్నా అది ఈ డ్రైవర్లకు ఏ మాత్రం పట్టదు. లక్షలు వెచ్చించి ప్రయాణికుల కోసం ఏసీ బస్టాండ్లు కట్టినా అవి ఈ డ్రైవర్ల కంటికి కనిపించవు. బస్టాండ్ ఒక చోట ఉంటే బస్సులు దానికి 30 మీటర్ల దూరంలో ఆగుతాయి. ఎక్కడబడితే అక్కడ రోడ్డు మధ్యలో ఇష్టానుసారం ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆపివేస్తుండడంతో ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయి. ఈ సందర్భాలలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు అవన్నీ బస్సు ఆగినంతసేపూ రోడ్డు మధ్యలో ఆగాల్సిందే. పోలీసుల కంటికి ఇదంతా కనిపించదు. కనిపించినా.. ఇదేమని డ్రైవర్‌ని ప్రశ్నించరు. వారికి ఎలాంటి ఫైన్‌లు ఉండవు. వీళ్లు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తున్నారన్న ధ్యాసే వీరికి ఉండదు. ఎందుకంటే వీళ్లు మామూళ్ల మత్తులో జోగుతుంటారు. కాబట్టే చూసి చూడనట్లు వదిలేస్తారు. ప్రతి కూడలిలో రెండేసి బస్సులు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను పిలుస్తూ అర్ధగంటకు తక్కువ కాకుండా బస్సులను ఆపేస్తారు. ప్రధానంగా ఆర్టీసీ, వీఆర్సీ బస్టాండ్లలో ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో అయితే ఈ బస్సుల దెబ్బకు పాదచారులు హడలి పోతున్నారు. అక్కడ మూడు నాలుగు బస్సులు వరుసగా గంటల కొద్ది ఆపివేసి ప్రయాణికులను పిలుస్తూ ట్రాఫిక్‌తో మాకు పని లేదు అన్న చందంగా బస్సుల సిబ్బంది వ్యవహరిస్తారు. వీళ్ళ ఆగడాలకు ఆటంకం ఉండదు. పాదచారులు మాత్రం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బస్టాండ్ పరిసరాల్లో తిరుగుతూ ఎప్పుడు ఏ వాహనం ఢీకొంటుందో అన్న భయాందోళనలో ఉంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీళ్ళ నిర్వాకంతో నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇక పోతే టౌన్ బస్సులకు నిర్ధేశించిన గడువులోపు ఫిట్నెస్ సర్టిఫికేట్లు, ఆయా బస్సుల యజమానులు క్రమం తప్పకుండా తీసుకుంటున్నారా, అంటే అది లేదు. ఎందుకంటే బాడీ దెబ్బతిన్న బస్సులు, సిగ్నల్ లైట్లు పగిలిపోయిన బస్సులు, కిటికీలకు అద్దాలు లేనివి, అరిగిపోయిన టైర్లతో తిరుగుతున్న వాహనాలు రోడ్లపైన హల్చల్ చేస్తున్నాయి. ఇలా తిరుగుతున్న ఈ బస్సులపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. పలానా టౌన్ బస్సుకు ఫిట్నెస్ గడువు తీరినా రోడ్లపై తిప్పుతున్నారని, గుర్తించి ఆ శాఖ ఎన్ని బస్సులు ఆపింది.. ఎలాంటి చర్యలు ఆ శాఖ చేపట్టదు. అందుకే ఈ బస్సులు యధేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి. అంతేకాదండోయ్ బస్సుల నుంచి వచ్చే దట్టమైన పొగ వల్ల ఏర్పడే కాలు ష్యాన్ని తనిఖీ చేసి మరో శాఖ కూడా ఉంది. అదేమంటారా...? అదేనండి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు. వీళ్లు అంటూ ఉన్నారా..? అన్న సమాచారం నెల్లూరు ప్రజలకు ఎవరికి అంతుచిక్కదు. ఇది మహారాజుల డిపార్టుమెంట్ సామాన్యంగా ఈ శాఖ అధికారులు బయట ఎక్కడా కనిపించరు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఫిర్యాదుతో కొన్ని చోట్ల మాత్రమే కనిపిస్తారు. నెల్లూరు నగరంలో దట్టమైన పొగ వదిలే బస్సులవంక అసలు చూడరు. ఈ బస్సులు వెదజల్లే కాలుష్యం ప్రజలకు శాపంగా మారింది. కాలుష్యాన్ని వెదజల్లుతూ అవి యధేచ్ఛగా తిరుగుతూ ఉన్నా.. వారి పర్యవేక్షణ ఎప్పుడూ ఉండదు.

ఈ పొగ వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు మాత్రం బలైపోతున్నారు. వీటి సైలెన్సర్ ద్వారా వచ్చే పొగ(కార్బన్ డయాక్సైడ్) కారణంగా ప్రజల నాడీ వ్యవస్థ, గుండె, ఊపిరితిత్తులు, కాలేయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం మెండుగా ఉందని, వైద్య నిపుణులు చెబుతున్నా, ఈ పర్యావరణ పరిరక్షణ శాఖకు ప్రజల ప్రాణాల పట్ల ఇనుమంతైనా దయ రాదు. లక్షలకు లక్షలు సజీతాలు తీసుకుంటూ పనీపాటా లేకుండా ఏసీ గదుల్లో కాలక్షేపం చేస్తారు. ఈ శాఖ ఉద్యోగులు అందుకే ఆ శాఖను మహారాజుల శాఖ అన తప్పదు. ఆ శాఖ తీరే వేరు. అది ఎవరికి అంతు చిక్కదు, ఇక ట్రాఫిక్ పోలీసులు, కాలుష్య నియంత్రణ మండలి, రవాణా శాఖ ఇవి ఈ బస్సుల ఆగడాలను ఆరికట్టాలి. ఈ మూడు శాఖలు ఎటువంటి చెకింగ్‌లు చేపట్టకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతు న్నాయనడంలో సందేహం లేదు. ఇకనైనా ఈ మూడు శాఖలు తీరు మార్చుకొని నిబంధనలకు విరుద్ధంగా ఫిట్నెస్ లేని బస్సులు తిప్పుతూ ట్రాఫిక్‌లో అడ్డగోలుగా నడిపే బస్సు డ్రైవర్లకు కనీస పరిజ్ఞానం కలిగి ఉండేలా దిశా నిర్ధేశం చేయాల్సి ఉంది. ఇవి వెదజల్లే కాలుష్యంపై తక్షణ చర్యలు చేపట్టి నగర ప్రజల ప్రాణాలు కాపాడాలని నెల్లూరు నగరంలోని ప్రజలంతా కోరుతున్నారు.

## నెల్లూరు పోలీసులను అభినందించిన మంత్రి నారాయణ

.. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

.. అసాంఘిక కార్యకలాపాల విషయంలో నిబంధనలను మరింత కఠినతరం చేయాలని జిల్లా ఎస్పీకి సూచించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త –వైద్యం** నెల్లూరులో జరిగిన గంజాయి అక్రమ రవాణా అరికట్టే విషయంలో పోలీసుల పనితీరును రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ అభినందించారు. గంజాయి స్మగ్లర్ దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఈగల్ టీమ్ కానిస్టేబుల్ పటాన్ ఫిరోజ్ ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరా తీశారు. నెల్లూరులో గంజాయితో కారులో పారిపోయేందుకు ప్రయత్నించిన స్మగ్లర్ సూర్యప్రకాశ్ ను అడ్డుకునే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడ్డ ఫిరోజ్ కు అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. కారును వెంబడించి చాకచక్యంగా స్మగ్లర్ ను అదుపులోకి తీసుకున్న సీఐ సాంబశివరావు ను, కానిస్టేబుల్ ఫిరోజ్ ను మంత్రి నారాయణ అభినందించారు. గంజాయి రవాణా, అమ్మకంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని మంత్రి తెలిపారు. ఈగల్ టీమ్ ద్వారా రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాల రహితంగా మారుస్తామని మంత్రి నారాయణ భరోసా వ్యక్తం చేశారు. అసాంఘిక కార్యకలాపాల విషయంలో జిల్లా పోలీసులు మరింత కఠిన తరంగా వ్యవహరించాలని మంత్రి తెలిపారు.

## నేటి నుండి అవధూత వెంకయ్య స్వామి ఆరాధనా ఉత్సవాలు

**వెంకటాచలం, ఆగష్టు 17, ప్రభాత వార్త:** ఆకలై కొంగు పట్టేవారికి అన్నం పెట్టాలయ్యా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలయ్యా అంటూ నిత్యం భక్తుల తో ఓం నారాయణ ఆది నారాయణ అంటూ విరాజిల్లుతున్న భగవాన్ వెంకయ్య స్వామి 43 వ ఆరాధనా ఉత్సవాలు అత్యంత వైభవంగా నేటి నుండి 24 వరకు నిర్వహించనున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ,ఈ ఓ ఏర్పాట్లు సిద్ధం చేశారు భక్తులకు డార్మెంటరీ,కల్యాణ మండపాలను సిద్ధం చేశారు ఆలయాన్ని విద్యుత్తు అలంకారాల మధ్య సుందరంగా తీర్చి దిద్దారు.తాగు నీరు,మరుగు దొడ్లు సిద్ధం చేశారు.రాష్ట్రం నుండే కాకుండా తమిళనాడు,కర్ణాటక,మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడం తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.ప్రత్యేక క్యూ లైన్లు,నెల్లూరు ఆర్టీసీ నుంచి ప్రత్యేక రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు.ఇసక పల్లెం, వెంకటాచలం ఆరోగ్య కేంద్రం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నెల్లూరు రురల్ డిఎస్‌పి జి.శ్రీనివాస రావు ఆధ్వర్యం లో గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

## అల్లూరు రాజు కుటుంబాన్ని పరామర్శించిన మేకపాటి



**సీతారామపురం ఆగస్టు 17 ప్రభాతవార్త :** సీతారామపురం మండల వైఎస్ఆర్‌సిపి సీనియర్‌నాయకులు బిట్-1 ఎంపిటిసి బిసి అల్లూరు రాజు కుటుంబసభ్యులను ఆదివారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల అల్లూరు రాజు తమ్ముడు కుమారుడు మృతి చెందడం జరిగింది. మృతి చెందిన వార్త తెలుసుకున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం అల్లూరు రాజు తమ్ముడు కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఉదయగిరి మాజీ ఎఎంసి చైర్మన్ అలీఅహ్మద్, మాజీ వైస్ ఎంపిపి రామిశెట్టి తిరపతయ్య, నెల్లూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ పాలగిరి ముద్దు కృష్ణమరాజు, తదితరులున్నారు.

## వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉంది ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి. వల్లూరు వెంకటేశ్వర్లు



**నెల్లూరు సిటీ, ఆగస్టు 17, ప్రభాతవార్త :** వృద్ధులను ఆదరించవలసిన బాధ్యత అందరిపై ఉందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి నెల్లూరు జిల్లా అధ్యక్షులు వల్లూరు వెంకటేశ్వర్ల అన్నారు. ఏపియూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం నెల్లూరు బాలాజీ నగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృద్ధులను ఆత్మీయంగా పలకరించాలని వారిని ఆదరించాలని ఆయన కోరారు భారతదేశంలో విదేశీ నాగరికతను పెరిగి తల్లిదండ్రులని వృద్ధాశ్రమాలకు పంపడం బాధాకరమన్నారు. అలాంటి సంఘటనలను దూరం చేయాలని ఈ రోజున వృద్ధులను సత్కరించి వారికి ఫలహారాన్ని అందజేయడం జరిగిందన్నారు. వృద్ధులనుఆదరించడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వృద్ధులను చీర శాలువా పూలదండలతో సత్కరించడం జరిగింది. అందరికీ ఫలహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ జయప్రకాష్. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి హనుకు సీనియర్ ఫోటోగ్రాఫర్స్ డిటి హరికృష్ణ, ఫోటో గ్రాఫర్ విభాగా జిల్లా అధ్యక్షులు. మాల్యాద్రి మురళీ, స్వర్ణసింగ్. ఆశ్రమ నిర్వాకుడు పాండు తదితరులు పాల్గొన్నారు.

## నూర్ బాషా దూదేకుల (బిసి) ముస్లిం సంక్షేమ సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక



**నెల్లూరు సిటీ, ఆగస్టు 17, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని స్థానిక టౌన్ హాల్ ఎసి హాల్లో ఆదివారం నూర్ భాషా బీసీ ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూర్ బాషా(బిసి) దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా షేక్ ఖాసిం, జిల్లా అధ్యక్షుడిగా బాబర్ జాన్ ,జిల్లా ఉపాధ్యక్షులుగా ఖాజా రహంతుల్లా, కాలేషా, ప్రధాన కార్యదర్శిగా ఖాజా మస్తాన్, ట్రెజరర్ గా మస్తాన్ సాహెబ్‌తో పాటు పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యూత్ అధ్యక్షుడిగా సుభాన్ భాషా, జనరల్ సెక్రటరీగా షేక్ అక్బర్‌ను టౌన్ అధ్యక్షులుగా హుస్సేన్, టౌన్ జనరల్ సెక్రటరీగా హబీబ్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ బాషా మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో నూరు బాషా బిసి ముస్లిం సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కమిటీ సభ్యులందరూ కృషి చేయాలన్నారు. నూర్ భాషాలకు ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకుని వస్తే ముందుండి పోరాటం చేస్తామన్నారు. నూతన జిల్లా అధ్యక్షులు కే బాబర్ జాన్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చినటువంటి ,నెల్లూరు జిల్లా నూర్ భాషా సోదర సోదరీమణులందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటూ, మన జిల్లాకు దూదేకుల భవన్ అవసరం ఎంతో ఉంది .కావున ఖాదర్ భాషా గారి ఆధ్వర్యంలో, ఇతర కమిటీ సభ్యుల ప్రోత్సాహంతో నా హయాంలోనే నూర్ భాషా దూదేకుల భవన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని, అందుకుగాను ,ముందుగా నా వంతుగా లక్ష రూపాయలు విరాళంగా ప్రకటిస్తున్నానని, అదే విధంగా జిల్లాలోని నూర్ భాషా సోదరులందరూ ఇది మనందరి ఇల్లు వలె, ప్రతి ఒక్కరు మీకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందచేసి, దూదేకుల భవన్‌ను, ఎవరు మీద ఆధారపడకుండా, మన కుల సభ్యులు అందరం ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని కోరుకుంటున్నాను. అందులో భాగంగాను జిల్లా నూర్ భాషా సోదరులు సుమారుగా 5 లక్షల రూపాయలు విరాళాలుగా ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూర్ భాషా దూదేకుల రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ,వివిధ మండలాల నాయకులు ,యువత, మహిళ, విద్యార్థి విభాగ నాయకులు పాల్గొన్నారు.

## శేషమ్మ భౌతికయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కావలి, ఆగష్టు17ప్రభాతవార్త :** కావలి పట్టణం 35వ వార్డుకు చెందిన ఉప్పాల సుధాకర్ తల్లి శేషమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గారు ఆదివారం వారి నివాసానికి చేరుకొని ఆమె భౌతిక ఖాయాన్ని దర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## పోలీసుల అష్టదిగ్బంధంలో కరేడు గ్రామం




**ఉలవపాడు, ఆగష్టు 17, ప్రభాతవార్త :** కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ కంపెనీ పరిశ్రమ స్థాపన కొరకు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా సోమవారం తలపెట్టిన ఛలో కరేడు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసు యంత్రాంగం సర్వసన్నద్ధం అయింది. సుమారు 300 మంది పోలీసులతో కరేడుకు వెళ్లే అన్ని మార్గాలను అష్టదిగ్బంధంలో బారికేడ్లతో పోలీసులు సిద్ధంగా ఉన్నారు. ఇదే కరేడు




రైతుల ఉద్యమంలో హైవే దిగ్బందానికి బోడె రామచంద్ర యాదవ్ పెద్దపల్లిపాలెం నుండి సముద్ర మార్గాన కరేడు చేరుకొని జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పోలీసు యంత్రాంగం పెద్దపల్లిపాలెంతో పాటు సముద్ర తీర ప్రాంతంలో కూడా భారీ బందోబస్తుని ఏర్పాటు చేసింది. ఛలో కరేడు పిలుపునిచ్చిన సీపీఎం నేతలు ప్రజా సంఘాలు, రైతు కూలీ సంఘాల నేతలను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కార్యాదర్శి జీవీబీ కుమార్‌ని కందుకూరు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, డి.జాన్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకొని ఆదివారం నాడు సింగరాయకొండలోని సీఐటీయు కార్యాలయంలో నిర్బందించారు. సోమవారం తలపెట్టిన కరేడు కార్యక్రమం ముందస్తు నేతల అరెస్టుతో పోలీసు బలగాల అప్రమత్తంతో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్ట్



**నెల్లూరు క్రైమ్ ఆగస్టు 17 ప్రభాతవార్త :** నగరంలోని పలు ప్రాంతాల్లో మోటార్ సైకిల్ చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను వేదాయపాలెం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే ఈనెల 9వ తేదీ పొదలకూరు రోడ్డు సమీపంలోని ఓ టిఫిన్ అంగడి వద్ద పార్కింగ్ చేసిన మోటార్ సైకిల్‌ను దొంగిలించారంటూ ముని శంకర్ అనే వ్యక్తి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న వేదయపాలెం సిఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే స్థానిక మల్లారెడ్డి దాబా సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వైయస్సార్ నగర్ కు చెందిన వడిదారుల శ్రీకాంత్, మూలాపేట కసాయి వీధికి చెందిన షేక్ ఖలీల్ అనే ఇద్దరు నిందితులను సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్సై నవీన్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బాలాజీ నగర్, సంతపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన శ్రీనివాసరావుతో పాటు ఎస్సై నవీన్ కుమార్, పి ఎస్సై సాయి కళ్యాణ్ ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ, నగర డిఎస్పీలు అభినందించారు.

## నిరుపేద వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణి. విద్యాప్రదాత, మానవతావాది డి.ఆర్.



**కావలి, ఆగష్టు17ప్రభాతవార్త :** డి.ఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్ లోని తమ కార్యాలయంలో డి.ఆర్ పేరుమీద 60 మంది నిరుపేద వృద్ధులకు 60 వేలు విలువ చేసే బియ్యం, వంటింటి సరుకులు, రొక్కం 60 రూపాయలు పంపిణి చేశారు. న్యూ అగర్వాల్ ఐ కేర్ సెంటర్ నేత్రవైద్యుడు బొబ్బాల మోహన్, సౌజన్య మోహన్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. బొబ్బాల మోహన్ మాట్లాడుతూ డి.ఆర్ గారు గొప్ప మానవతావాది అని, విద్యాప్రదాత అని, వారు సమాజానికి చేసిన సేవలు అమూల్యమని అన్నారు. డి.ఆర్ మార్గంలో కళాశాలలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వినయకుమర్ రెడ్డి, విద్యాధర కుమార్ రెడ్డిలకు అభినందనలు తెల్పారు. నేను విశ్వోదయ పూర్వ విద్యార్థి అయినందుకు గర్వపడు తున్నానని, అవసరమైన ఈ వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నెల్లూరు విజేత ఐ హాస్పిటల్ లో చేయిస్తానని అన్నారు. సయ్యద్ మస్తాన్ జ్ఞాపకార్ధం వారి కుమారుడు అన్వర్ వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్ విశ్వోదయ సేవాసమితి చైర్ పర్సన్ దొడ్ల లక్షీ ్మ, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సేవాసమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ ,సతీష్ సింగ్, పి.బి. ఆర్ విట్స్ రామకృష్ణ, సయ్యద్ అన్వర్ పాల్గొన్నారు.

## కలువాయిలో ఉచిత మెగా వైద్యశిబిరంకి విశేష స్పందన




**కలువాయి ఆగష్టు 17 ప్రభాతవార్త :** లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు ,వాసవీక్లబ్ కలువాయి మండల శాఖ వారి ఆద్వర్యంలో నారాయణ మెడికల్ కాలేజి హాస్పటల్స్ వారి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంకు విశేష స్పందన లభించింది. బివిఎస్ఆర్ జడ్‌పిహైస్కూల్ నందు నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో డాక్టర్ కృష్ణ కుమార్ వైద్య బృందం రోగులకు కంటి పరీక్షలు ,దంత పరీక్షలు, ఇతర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపు నందు కంటికి సంబందించి 108 మంది రోగులు వినియోగించుకోగా వారిలో ఐఓఎల్‌కు 20 మంది, కంటి అద్దములకు 12 మంది ఎంపికైయ్యారు. అదే విధంగా డెంటల్ క్యాంపు నందు 39 మంది డెంటల్ స్కీనింగ్ చేయించుకోగా వారిలో 16 మందికి హాస్పటల్ నుండి వచ్చిన మొబైల్ వ్యాను నందు దంత పరీక్షలు నిర్వహించారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి లయన్స్‌క్లబ్ మెంబర్స్ లయన్ సూర్య ప్రకాష్‌రావు, జి శ్రీనివాసరావులు సహకారం అందించారు. క్యాంపు చైర్మన్ పి. ఆంజనేయులు నిర్వాహకులు వి.శ్రీదర్, ఎం రామకృష్ణా, మెంటా వెంకటేశ్వర్ల కలువాయి వాసవీక్లబ్ ప్రెసిడెంట్ సోమిశెట్టి మహేష్‌కుమార్, సోమిశెట్టి సుభాష్ తదితరులు ఈకార్యక్రమంలో ఉన్నారు. ఉదయం నుండి వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్దఎత్తున గ్రామస్తులు ఈకార్యక్రమంలో పాల్గోనడం గమనార్హం.

## బుచ్చిలో మట్టిరోడ్డుగా మారిన సిమెంట్‌రోడ్డు



**బుచ్చి ఆగష్టు 17 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయితీలోని జెండాదిబ్బకు వెళ్లే రహదారి మట్టిరోడ్డుగా బురద గుంటల మయమైంది. ఈ రోడ్డు కొద్ది దూరం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోనే వుంది. వర్షం వస్తే పెద్దపెద్ద గుంటలతో ఈ రోడ్డు అత్యంత దయనీయంగా మారుతుంది. వాహనచోదకులు అనేక సార్లు ఈరోడ్డులో ని గుంటలలో పడి ప్రమాదాలకు గురైయ్యారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఈరోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి ఈరోడ్డు సిమెంట్ రోడ్డు వేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



**ఉదయగిరి, ఆగష్టు 17, ప్రభాతవార్త :** గత వైసీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీల ధర్నాల సమయంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి రెహనాబేగం కోరారు. ఆదివారం సీఐటీయు నాయకులు కోడె రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన కోరికలు కోసం ధర్నాలు చేపట్టారని, ధర్నాల సమయంలో టీడీపీ ప్రభుత్వం జీతం హామీలను ఇచ్చిందని హామీలు నెరవేర్చుకునే దిశగా ఎలాంటి ఆలోచన చేయటం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ధర్నాల సమయంలో తమకు ఇచ్చే గౌరవ వేతనం ఆపిందని అలాంటి సమయంలో అంగన్‌వాడీలకు అండగా ఉండి ధర్నాల కాలంలో వేతనం చెల్లించడంతో పాటు న్యాయమైన కోర్కెలను సైతం నెరవేరుస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చాని ఆమె గుర్తు చేశారు. అందరూ ఏకతాటిపై నిలబడి తెలుగుదేశం పార్టీని బలపరిచి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చామని అయితే కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సీఐటీయు యూనియన్ లీడర్ రజియా, సీఐటీయు నాయకులు షేక్ నాయబ్ రసూల్, మల్లెల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ మినీ మెయిన్ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

## అమర ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితుడు కి ఆర్ధికసాయం



**కావలి, ఆగష్టు17ప్రభాతవార్త :** కావలి పట్టణం 8వవార్డులో నివాసం ఉండే జలదంకి శివకుమార్ కి క్యాన్సర్ వ్యాధి వలన ఆర్థికంగా స్తోమత లేక చాలా ఇబ్బంది పడుతున్నవిషయము ఎనిమిదవ వార్డులోనితెలుగుదేశం పార్టీ నాయకులు అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా దృష్టికి తీసుకు రాగా తన మిత్రుల సహకారంతో ఆదివారం స్థానిక ఏవీఎస్ కళ్యాణ్ మండపం నందు 45 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కావలి మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్ పాల్గొని 5000 / రూపాయలుఆర్థికసాయం అందించారు. మొత్తం కలిపి శివకుమార్ కుటుంబానికి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడంజరిగింది జలదంకి శివకుమార్ కు ఆర్థిక సాయం చేసినదాతలు. తటవర్తి రమేష్. అమర వేదగిరి సుబ్బరాయుడుగుప్త. మునగనూరి చిన్న తిరుపాలు. బలస ప్రసాద్ బొగ్గవరపు రవీంద్ర. చిడెల కిషోర్ గుప్తా. చలువాది రవికిరణ్, జొన్నలగడ్డ రాజశేఖర్, నల్లూరు మధు, రాజా రమణయ్య, రాజా శ్రీనివాసులు, గునుపూడి సుదీర్, ఇన్నమూరి వెంకటసుబ్బారావు, పెట్టుగానివెంకట సురేంద్ర, మద్దాలి రమేష్, ఏల్చూరి రవి, ఓలేటి గుప్తా, సాయి కృష్ణ, మామిడిరామకృష్ణ, సోమిశెట్టి రామకృష్ణ, బొగ్గవరపు స్వామి సాయం చేయడం జరిగింది సాయం చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటాను అని బాధితుడు తెలియజేసారు

## ప్రజాస్వామ్యాన్ని అవమానపరుస్తున్న రాహుల్ గాంధీ



**నెల్లూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త -వైద్యం :** కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మాత్రమే చేస్తున్నాయని ముఖ్యంగా చొరబాటుదారుల ఓటు బ్యాంకును కాపాడుకోవడమే వారి అసలు లక్ష్యం అని బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. 1952 నుండి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓడిన ప్రతి సారి ఎన్నికల సంఘంపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలపై ఆరోపణలు చేసి ఆధారాలు ఇవ్వకుండా వెనక్కి తగ్గడం వారి అలవాటు అని ఆయన పేర్కొన్నారు. రాయ్‌బరేలీ, వయనాడ్, డైమండ్ హార్బర్, కన్నౌజ్ తదితర నియోజకవర్గాల్లో లక్షల సంఖ్యలో అనుమానస్పద ఓటర్లు, పునరావృత ఓటర్లు, నకిలీ చిరునామాలు తప్పుడు నమోదు తప్పు వయసు వివరాలు, పెద్ద ఎత్తున ఓటర్ల చేర్పులు వెలుగులోకి వచ్చినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఓటు దోపిడి ఆరోపణలు పూర్తిగా అసత్యమని వారి ప్రయత్నం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలను కాపాడుకోవడమేనని చిలకా ప్రవీణన కుమార్ పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, రాయ్‌బరేలీ, వయనాడ్ ప్రాంతాల్లో పునరావృతం నమోదు, తప్పుడు బంధువులు, కలిపిన కుటుంబాలు, నకిలీ చిరునామాలు వంటి అనేక అవకతవకలు బయటపడ్డాయని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల సంఘం ప్రతి నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం చెప్పడం, వాస్తవాలను నిర్లక్ష్యం చేసి ప్రజలను మోసం చేయటం వారి పని శైలిగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. నిజమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడానికి ప్రవేశపెట్టిన సాక్ష్యాధార గుర్తింపు విధానం కాంగ్రెస్ , ప్రతిపక్ష పార్టీలు తనఈరవంగా వ్యతిరేకించడం కేవలం చొరబాటుదారుల ఓటు బ్యాంకు కోసం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడిన ప్రతి సారి కొత్త ఆరోపణలు చేయడం, నిరాధారమైన నిందలు వేయడం, ఆధారాలు చూపకుండా వెనక్కి తగ్గడం అవి కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ, రాజకీయ వైలి యొక్క ప్రతిబింబం అని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎన్నో సార్లు తిరస్కరించడానికి ప్రధాన కారణం వారి ఓటు బ్యాంకు రాజకీయాలు, నకిలీ ఓట్లు, నిజమైన ఓటర్ల హక్కులను అపహరించడం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ విధానం ద్వారా నకిలీ ఓట్లను తొలగించి నిజమైన భారతీయ పౌరులకు ఓటు హక్కును దృవీకరించడం బీజేపీ ప్రధాన లక్ష్యం. దీనిని వ్యతిరేకించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నిలబడటమే అని చిలకా ప్రవీణ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో ప్రజాదరణ కోల్పోతున్నప్పుడు తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని, భారతీయ జనతా పార్టీ మాత్రం నిజమైన ఓటర్ల జాబితాలు, సాక్ష్యాధార గుర్తింపు విధానం, ఎన్నికల సంస్కరణల విషయంలో పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

## కష్టమర్లకు మొండి చెయ్యి.. బ్లాక్‌లో జోరుగా గ్యాస్ అమ్మకాలు

**ఉలవపాడు, ఆగష్టు 17, ప్రభాతవార్త :** భారత్ గ్యాస్ కరేడు చిన్న పల్లిపాలెంలో 15 రోజులకు ఒక సారి కూడా వినియోగదారులకు సిలిండర్లు అందజేయడం లేదని కష్టమర్లు వాపోతున్నారు. గ్యాస్ వాహనం ఎప్పుడు వస్తుందా అని ఖాళీ సిలిండర్లకు రోజు ఎదురు చూడటం పరిపాలిటిగా మారిందని గ్రామస్తులు చెప్తున్నారు. 15 రోజులకు ఒక సారి గ్రామంలోకి భారత్ గ్యాస్ వాహనం వచ్చిన టీ కొట్టు టిఫిన్ కొట్టుకు మూడు నాలుగు సిలిండర్లు అమ్ముకుంటూ వినియోగదారులకు మొండి చేయి చూపిస్తున్నారని చిన్న పల్లిపాలెం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైగా ఉచితంగా గ్యాస్ డెలివరీ చేయాలని 15 కిలోమీటర్లు లోపు ఉన్న వినియోగదారుల వద్ద ఎలాంటి ఛార్జీలు వసూళ్ల చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికి భారత్ గ్యాస్ సిబ్బంది వినియోగదారుల వద్ద నుంచి 70 రూపాయలు వసూళ్ల చేస్తున్నట్లు వారు ఆరోపణలు చేశారు. సకాలంలో వినియోగదారులకు గ్యాస్ ఎక్కువగా అదనంగా మరో 70 రూపాయలు వసూళ్ల చేయటంపై అక్రమంగా బ్లాక్ మార్కెట్లో సిలిండర్లు అమ్ముకోవడంపై సంబంధిత అధికారులు భారత్ గ్యాస్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని చిన్నపల్లిపాలెం గ్రామం వినియోగదారులు అధికారులను కోరుతున్నారు.

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవం

**వింజమూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త :** వింజమూరులోని వింజమూరు, బట్టువారిపాలెం రోడ్డు సమీపంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దివాకర్ ఆధ్వర్యంలో అర్చకులు సారథ్యంలో ఆలయ ధర్మకర్త గానుగపెంట, శ్రీహరి రెడ్డి, తృకుమారి కుటుంబ సభ్యులలో ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతాభిషేకములు జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా హోమములు జరిపించారు. తదుపరి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ అసలు ధ్వజస్తంభం ఏర్పాటు ఎలా జరిగిందని వివరించారు. ధ్వజస్తంభం దేవాలయాన్ని పిడుగుపాటు నుండి రక్షించేదిగా ఉంటుంది. ఇది దేవాలయపు వెన్నుముకగా వర్ణించారు. దేవాలయం నడుమ భాగంలో స్తంభం అడుగుభాం ఉంటుంది. ఈ ధ్వజస్తంభం గర్భగుడిలో దాకా అడ్డంగా వెన్నుపోములే పడుకోబెట్టినట్టుగా భావించబడుతుంది. దాని తలపై ధ్వజస్తంభ వాహక దేవత ప్రతిష్ఠించబడి ఉంటుందని తెలిపారు. ధ్వజస్తంభం పైన సింహం బొమ్మ ఉంటుంది. కొండల నీ శక్తిని ముద్రించిన పతాకం ఏర్పరచబడి ఉంటుంది. కుండలిని శక్తి కలిగి ఉన్న జెండాను పైకి ఎత్తడం అంటే ప్రాణాయామం ద్వారా భక్తుని కుండలిని శక్తిని జాగ్రత్తపరిచి సహస్రారానికి తీసుకుని పోవడం అని అర్థాన్నిస్తుందన్నారు. ప్రకృతి నుంచి వచ్చే శక్తిని భగవంతునికి అందించేందుకు సహకారిగా ఉంటుందని వారు తెలిపారు. కాబట్టి ఈ దేవాలయం ధ్వజస్తంభం కలిగి ఉందిగా ఉన్న ఇన్ని ఆలయంగా లెక్కలోకి వస్తుందన్నారు. ధ్వజస్తంభం లేని దానిని గుడిగా మాత్రమే లెక్కిస్తారు అన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులైన అంకెనపల్లి ఓబుల్‌రెడ్డి, పెసల మాల్యాద్రిరెడ్డి, లెక్కల శ్రీనివాసరెడ్డి, పరిసర గ్రామాల భక్తులు తదితరులు ఉన్నారు.



## వైద్యాధికారి మురళీధర్‌కు ఉత్తమ సేవా పురస్కారం

**వింజమూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త :** వింజమూరు మండలం చాకలకొండ ప్రాథమిక ఆరోగ్యం వైద్యాధికారి డాక్టర్ మురళీధర్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ వైద్యాధికారిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత చేతుల మీదుగా మురళీధర్ ఉత్తమ సేవా పురస్కారం అవార్డు అందుకున్నారు. ఆయన వైద్యాధికారిగా మండల పరిధిలోని రోగులకు అందించిన సేవలకు ఆరోగ్య కేంద్రంలో ఓపీ అధికంగా ఉండటం సిబ్బందితో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా వారిని ప్రోత్సహించడం, ప్రభుత్వ కార్యక్రమాలు బాధ్యతగా చేస్తున్నందుకు గుర్తింపుగా జిల్లా అధికారులు ఈ అవార్డును అందించినట్లు ఆయన తెలిపారు. వైద్యాధికారికి ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం పట్ల వైద్యఆరోగ్య సిబ్బంది డాక్టర్ మురళీధర్‌కు అభినందనలు తెలిపారు.



## పుచ్చలపల్లి సుందరయ్య కృషి కొనియాడదగినది



**కోవూరు , ఆగష్టు 17 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటుకు సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చేసిన కృషి కొనియాడదగినదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు అన్నారు. కోవూరులోని సీతాపోలయ్య భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కోవూరు మండల నాల్గవ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకంకు చట్టభద్రత కల్పించిన మహామనిషి అన్నారు. ఇందుకు సీపీఎం పార్టీ చేసిన కృషి ఎనలేనిదన్నారు. అంతకుముందు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పెద్దబ్బయ్య, విజయకుమార్, లీలమ్మ, అఫ్రోజ్, చాన్బఆషా, శేషయ్య, విజయభాస్కర్, బుజ్జయ్య, తదితరులు ఉన్నారు.

## ప్లాస్టిక్‌కవర్ల నిషేదిత చట్టంపై అవగాహన పెంచుకోవాలి



**జలదంకి, ఆగష్టు17, ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌కవర్ల నిషేదిత చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకొని వాటిని నియంత్రించేవిధంగ అందరు కృషిచేయాలని లోక్‌సత్తా ఉద్యమసంస్థ రాష్ట్ర సమన్వయ కమిటి సభ్యుడు ఎం మాలకొండారెడ్డి కోరారు. ఆదివారం ఆయన దీనిపై ఒకప్రకటన విడుదలచేశాడు. పురపాలకసంఘాలు ,మండలాలలో 120మైక్రాన్ల కన్నా తక్కువగేజ్‌వున్న ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు చేసినవినియోగించిన అపరాధరుసుం వుంటుందని అన్నారు. దీనికి పౌరసంస్థలు, పురపాలకశాఖ అదికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగ కృషిచేయాలని తెలిపారు. మనం నివసించే నేల, పీల్చేగాలి, త్రాగే నీరుమనచుట్టువుండే మొక్కలు, జంతుజాలాన్ని పర్యావరణమంటామని దానిని రక్షించుకోవడంకోసం నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగంవలన కలిగే దుష్ఫలితాలు కాన్సర్‌వంటి వ్యాధులు ప్రభలుతున్నాయని వైద్యవిజ్ఞానం చెబుతుం దన్నారు. కావున ప్లాస్టిక్‌కవర్లను నియంత్రించి గుడ్డ సంచులు, దోనేలు, ఇస్త్రారాకులు వంటివి శుభకార్యాలలో నిత్యజీవితంలో వినియోగించుకొనా పర్యావరణాన్ని రక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

## బిత్రగుంట రైల్వే పూర్వ విద్యార్థుల కలయిక



**నెల్లూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త :** 2003 సంవత్సరం లో పదోతరగతి పూర్తి చేసాక అందరు విడిపోయారు తరువాత ఇప్పుడు 22 సంవత్సరములు తరువత తిరిగి నెల్లూరు లోని మినర్వా గ్రాండ్ హోటల్ లో ఈరోజు కలువటం జరిగింది అలాగే వారికి చదువు చెప్పిన టీచర్ ని పిలిపించి సన్మానం చేసారు, 22 సంవత్సరములు తరువత కలవటం విద్యార్థులు అందరు చాల సంతోషం వెక్తం చేసారు

## దళితుల పైన దాడులను పార్టీ లకు అతీతంగా ఖండించాలి



**బిట్రగుంట ఆగష్టు 17 ప్రభాతవార్త:** బోగోలు మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం బోగోలు సెంటర్ వద్ద ఎస్సీ ఎస్టీ జేఏసీ సమన్వయ సమావేశం నిర్వహించడం ఆదివారం జరిగినది. తొలుతగా అంబేద్కర్ విగ్రహానికి దాసరి బాబురావు బుర్రి వెంకట్రావు బత్తుల రవిచంద్ర పత్రి గోపి, పూలమాల అలంకరణ చేయగా తదుపరి సభ ప్రారంభమైనది. లిటిల్ ఇంగ్లాండ్ గా పేరుందిన అన్ని వర్గాల వారిని సమంగా ఆదరించిన లోకో షెడ్ తో భారతదేశ వ్యాప్తంగా రైల్వేలో చరిత్ర సృష్టించిన బోగోలు మండల కేంద్రంలో దళితులు అణగారిన వర్గాలైన ఎస్సీ ఎస్టీ ల పై బీసీ బీసీలు దాడులు చేయడం సరికాదని నిరసిస్తూ కావలి నియోజకవర్గం లో బీసీల నుండి అత్యున్నత స్థాయికి చేరిన వారు ఈ పరంపరకు అడ్డుకట్ట వేయాలని తమ తమ సామాజిక వర్గాలను ఈర్ష ద్వేషాలకు అతీతంగా ఉంచాలని అభివృద్ధి పట్ల అడుగులు వేసే విధంగా వారిని ప్రేరేపించాలని అమానుషమైన దాడులను నిలుపుదల చేయాలని పిలుపునిస్తూ తీర్మానం చేసారు. ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షులు జ్యోతి సోమశేఖర వరప్రసాద్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు మాజీ కొప్పోలు రఘు, ఇల్లు సాల్మన్ జువిగుంట బాబు మరియు కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడిపించిన వారిని ప్రసంశించారు. ఎస్సీ ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షులు బత్తుల రవిచంద్ర మాట్లాడుతూ పార్టీలకతీతంగా బోగోలు నందు దళితుల మీద జరిగే దాడులను ఖండిస్తూ అన్ని ప్రజా సంఘాల నేతలతో దళితుల ఆత్మగౌరవ సమావేశాన్ని ఏర్పాటు చేయడమైనది తెలిపారు. ఈ కార్యక్రమంకి హాజరు అయిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మరియు దమ్ము శ్రీరాములు, శ్రీహరి మిట్ట అశోక్, దుగ్గిరాల వీరంబట్లు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లికానుక అందజేసిన మన్నేటి



**వింజమూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని లెక్కలవారిపాలెంలో జిల్లెల మాల్యాద్రి మంజుల కుమార్తె వివాహానికి రూ.10000 తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ ఛైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి పెళ్ళి కానుక అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. లెక్కలవారిపాలెం గ్రామ నివాసి జిల్లెల్ల మాల్యాద్రి పక్షవాతానికి గురై కూతురి వివాహానికి ఇబ్బందులు పడుతుంటే స్థానికులు జనసేన టీడీపీ నాయకులు మన్నేటి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన తక్షణమే స్పందించి స్థానిక యువకులు కమతం శ్రీనివాసులు, జిల్లెల కొండలరావు, జిల్లెల్ల రాజ, భువనేశ్వరం విజయ్, శ్రీను, భువనేశ్వరం రవి చేత రూ.10వేలు వాళ్ళ ఇంటి వద్ద పెళ్లి కుమార్తెకి అందజేశారు. స్థానికులు వెంకట్‌రెడ్డి సేవలకి హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామ పోంగళ్ళు, గ్రామోత్సవంతో ముగిసిన శ్రీశ్రీశ్రీ రాపూరమ్మ కొలుపు





**రాపూరు, ఆగష్టు17ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ రాపూరమ్మ తల్లికి గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న కొలుపు(జాతర), కార్యక్రమం ఆదివారం నిర్వహించిన గ్రామ పోంగళ్ళు, గ్రామోత్సవంతో ముగిసింది. ఇందులో బాగంగా ఉదయం భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు తట్టలలో పూజా సామగ్రిని, పోంగళ్ళు సామాగ్రిని వుంచి తలపై పెట్టుకోని ఊరేగింపుగా తప్పెట్ల మోతలతో అమ్మవారి ఆలయానికి చేరుకోని భక్తి శ్రద్దలతో అమ్మవారికి పోంగళ్ళు పెట్టుకోని అమ్మకు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం ముందు బాగానా వెసిన అమ్మ ముగ్గు భక్తులను ఆకట్టుకుండి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తికి పలు రకాలైన పుష్పాలతో శోభామానంగా ఆలంకారం నిర్వహించి ట్రాక్టర్‌పై వుంచి గ్రామంలో గ్రామోత్సవాన్ని సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

## కండలేరులో 28.23 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు), ఆగష్టు17ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో ఆదివారం ఉదయం నాటికి జళాశయంలో 28.23 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జళాశయంలోకి 6840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1865 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 40 క్యూసెక్కులు, లోలెవల్ లిఫ్టింగ్‌కి 100 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2005 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## మాతమ్మ దేవాలయంలో విగ్రహా ప్రతిష్ట



**మనుబోలు ఆగష్టు 17 ప్రభాతవార్త :** మనుబోలు మండలం పిడూరు గ్రామంలోని అరుంధతీయవాడలో మాతమ్మ విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం నాడు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా మాతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంతోపాటు పూర్ణాహుతి, కుంభాభిషేకం , గోపూజ అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మన్నెమాల సాయి మోహన్‌రెడ్డి సహకారం గ్రామస్తుల సహకారంతో కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈకార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ హరి గోపాల్‌రెడ్డి , రాష్ట్రనాయకులు దాసరి బాస్కర్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటరమణరెడ్డి ,కిషోర్‌నా యుడు, కుడుముల వెంకటరమణయ్యగౌడ్ మరియు పెద్దఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



**నెల్లూరు క్రైమ్ ఆగష్టు 17 ప్రభాతవార్త :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక వేదయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు స్థానిక సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన సబ్బు శ్రీకాంత్ (36) పదేళ్ల కిందట రాజ్యలక్ష్మి అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆమెకు అప్పటికే వివాహమై మొదటి భర్త చనిపోయి ఉన్నాడు. శ్రీకాంత్ వివాహం చేసుకున్నాక ఆమెకు కుమారుడు కలిగాడు. ఇటీవల కొంతకాలంగా భార్యాభర్తల నడుమ సఖ్యత లోపించి కలహాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో లక్ష్మి తన భర్త శ్రీకాంత్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి స్టేషన్లో విచారణకు హాజరైన శ్రీకాంత్ అతని తల్లి సంపూర్ణమ్మ తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తాను తర్వాత వస్తానని ఆమెను వెళ్ళమని చెప్పాడు. ప్రేమించిన భార్యతో కలహాలు రావడంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్ వేదయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి వేదాయపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శ్రీనివాసరావు, శ్రీకాంత్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ట్రాక్టర్‌ను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలి



**కావలి, ఆగష్టు17ప్రభాతవార్త :** కావలి పట్టణం 22వ వార్డు వెంగళరావు నగర్‌లోని రామచంద్ర మిషన్ రోడ్డులో శేషభూషణ రావు ఇంటి ప్రహరీ గోడ ముందు ఎపి 39 యూబి 5055 నెంబరు గల ట్రాక్టర్ గత రెండు నెలల నుండి పార్కింగ్ చేసి వుంది. ఇప్పటి వరకు ఈ ట్రాక్టర్‌ను తీసుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు చెత్తా చెదారాన్ని ట్రాక్టర్ క్రింద పోస్తుండడం వల్ల ఆ ప్రాంతం అంత దుర్గంధ భరితంగా మారింది. పందులు ఇక్కడే అవాసం చేసుకోని వుండటంతో అటుగా వెల్లేవారందరూ ఆ దుర్గంధాన్ని భరించలేక ముక్కులు మూసుకోని వెల్లిల్సిన పరిస్థిది వస్తుంది. అనుమానాస్పదంగా వున్న ట్రాక్టర్‌ని మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు తొలగించే చర్యలు చేపట్టాలని శేషభూషణరావు ఇంటిలో అద్దెకు వుంటున్న భారతీయ జనతా పార్టీ రాష్ట మజీ ఎస్సీ కార్యవర్గ సభ్యులు, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఎపి, రాష్ట అధికార ప్రతినిధి డాక్టర్ దారా శ్రీనివాసులు, ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## సంయుక్త సంరక్షణ పిల్లలకు నిత్యవసర వస్తువులు వితరణ



**కావలి, ఆగష్టు17ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో వున్న పిల్లలకు ఆదివారం నెలకు సరిపడా వస్తువులు, బియ్యం, పోస్టాపిసు నందు ప్రతి నెలా రూ. 1000 జమ చేస్తున్న పాస్ పుస్తకాలను ఆందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ సభ్యులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఏ ఆదారం లేని కుటుంబాలలోని పిల్లల్ని సంయుక్త సేవా సంస్థ ద్వారా దత్తత తీసుకోని పిల్లల్ని వారి సంరక్షకుల వద్దనే వుంచి ప్రతి నెలా వారి జీవన భృతికి నిత్యవసర వస్తువులు, బియ్యం, అందజేయడమే కాకుండా పిల్లల భవిష్యత్‌అవసరాలకు ప్రతి నెలా రూ. 1000 నగదు జమ చేస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. పిల్లలు ఎంతో ఇష్టంగా చదువుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారికి సహాయం అందజేస్తున్న దాతలకు, తల్లితండ్రులకు మీకు అండగా వున్న సంయుక్త సేవా సంస్థకు మంచి పేరు తీసుకోని రావలని కోరారు. సంస్థ సంరక్షణలో వున్న పిల్లలకు అనారోగ్యం వచ్చినా వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పి. శ్రీధర్, డాక్టర్ పి. శివప్రసాద్‌లకు ప్రత్యేకంగా అభినందించారు. తమకు అండగా నిలిచిన దాతలకు రుణపడి వుంటామని, ఈ రోజు మూడు పూటలా తింటున్నామంటే దాతలే కారణమని , ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలియ చేస్తున్నామని లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థ సీనియర్ సభ్యులు విఎన్ ప్రసాద రావు, షేక్ ఖాధర్ బాషా తదితరులున్నారు.

## విధేయతకు పట్టం



**కోవూరు , ఆగష్టు 17 ప్రభాతవార్త :** కోవూరు మండలం చెర్లోపాలెం గ్రామానికి చెందిన శ్యామ్ సుందర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉంటూ గ్రామంలో పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేసే వారు. అప్పట్లో తనను పార్టీ మారమని అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్ల చేసినా పార్టీ మారకుండా తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు. గతంలో ఐదు సంవత్సరాల పాటు ఎంపీటీసీ సభ్యుడిగా కూడా శ్యామ్ సుందర్‌రెడ్డి పనిచేశారు. పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, విధేయత కోవూరు పడుగుపాడు సహకార సొసైటీ ఛైర్మన్ పదవి వరించింది. శ్యామ్ సుందర్‌రెడ్డి నియామకం పట్ల రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నెల్లూరు టౌన్ హాల్‌లో తోటా వెంకటేశ్వర్లుకు సన్మానం



**కావలి, ఆగష్టు17ప్రభాతవార్త :** కావలి పట్టణ జ్ఞానవిజ్ఞాన వేదిక అధ్యక్షులుగా, టివిఎస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా, యూటిఎఫ్ సినియర్ నాయకులుగా, కావలి రెడ్ క్రాస్ లైఫ్ మెంబరుగా మరియు అనేక స్వచ్ఛంద సేవా సంస్థలలో కావలి పట్టణంలో పరిసర ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ధర్మచక్రం సినియమా అడియో పరిచయ మరియు చంద్రన్న సేవా రత్న పురస్కారోత్సవం సందర్భంగా నెల్లూరు టౌన్ హాల్ నందు ధర్మచక్ర సినిమా దర్శక, నిర్మాత అయిన పసుపులేటి వెంకటరమణ తోట వెంకటేశ్వర్లుకు మెమాంటో బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ని సంస్థలు వున్నా వాటిలో సేవకునిగా ప్రజలకు సేవ చేయడమే తన ధర్మం అని, ఈ ధర్మాన్ని ఎల్లవేళలా కాపాడుకుంటానని తెలిపారు. ఈ రోజు ప్రత్యేకంగా తనను ఆహ్వానించి సన్మానించిన ధర్మచక్రం సినిమా యూనిట్ సభ్యులకు, ముఖ్యంగా దర్శక, నిర్మాత పసుపులేటి వెంకటరమణకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ధర్మచక్రం సినిమా యూనిట్ సభ్యులు, ప్రేక్షకులు తదితరు లున్నారు.

## గంజాయి మత్తులో జోగుతున్న ఇనమడుగు యువత

### - తల్లిదండ్రులు స్పందించాలి



**కోవూరు , ఆగస్టు 17 ప్రభాతవార్త :** ఒకవైపు ప్రభుత్వం, పోలీసులు, ఎక్సైజ్, ప్రత్యేక బృందాలు అనేక గట్టి బందోబస్తు చర్యలు చేపడుతున్నా గంజాయి మాత్రం యువత చేతిలో చిత్తు అవుతూనే ఉంది. ఫలితంగా భావిభారత పౌరులుగా ఉండాలనుకున్న యువత గంజాయి మత్తులో జోగుతుంది. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ గ్రామంలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, మరికొంత మంది జులాయి వ్యక్తులు కలిసి గంజాయి తాగుతుండగా గ్రామస్తులు పట్టుకుని ఈ విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో పట్నాలకే పరిమితమైన ఈ గంజాయి గ్రామాలతో పాటు కళాశాలలు, పాఠశాలలకు కూడా ప్రవేశించింది. దీంతో భావిభారత పౌరులుగా దేశాన్ని రక్షించాల్సిన యువత గంజాయి మత్తులో జోగుతుంది. గతంలో కూడా ఈ ఉన్నత పాఠశాలలోని 6 మంది విద్యార్థులు ఒక ఇంట్లో గంజాయి తాగుతుండగా గ్రామస్తులు పట్టుకుని అప్పట్లో పోలీసులకు కూడా అప్పగించారు. ఈ నేపథ్యంలో అప్పట్లో కోవూరు ఎస్సై వీరి తల్లిదండ్రులను పిలిపించి గట్టిగా మందలించారు. కొంతకాలం సర్దుమనిగినా ఈ గంజాయి మరలా యథావిధిగా పాఠశాలల్లోనూ, గ్రామాల్లోనూ విచ్చలవిడిగా దొరుకుతుంది. దీనిపై పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నా సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ఆశించిన మేర స్పందన లేకపోవడంతో ఇనమడుగులోని కొంతమంది యువత ఈ గంజాయికి బానిసలయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాల, పాఠశాలల ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయకపోతే రానున్న రోజుల్లో పాఠశాలలు గంజాయి కేంద్రాలుగా మారే అవకాశం కూడా ఉంది.

## ప్రమాదకరంలో వేగూరు కాలువ బ్రిడ్జి

### - స్పందించకపోతే ఇబ్బందే..





**కోవూరు , ఆగస్టు 17 ప్రభాతవార్త :**నిత్యం ఈ దారి గుండా ప్రతి రోజూ వందలాది వాహనాలు ప్రయా ణిస్తూనే ఉన్నాయి. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. గతంలో ఈ రహదారి గుండా రెండు నెలల పాటు పెన్నా బ్రిడ్జి మరమ్మతుల కారణంగా భారీ వాహనాలు అన్నీ ఈ రహదారి గుండా ప్రయాణించాయి. దీంతో ఈ కాలువ బ్రిడ్జికి పలుచోట్ల రంధ్రాలు పడి కూలే స్థితికి చేరుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ బ్రిడ్జి నిర్మాణం కనీసం మరమ్మతులు చేయకపోతే కోవూరు నుంచి నెల్లూరు వైపుకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుంది. దీనికి తోడు నిత్యం ఈ బ్రిడ్జి మీద వందలాది వాహనాలు వెళ్తున్నాయి. ఏ సమయంలోనైనా భారీ వాహనం ఈ బ్రిడ్జి మీద వెళ్లి మరమ్మతులకు గురైతే బ్రిడ్జి కూడా కూలే పరిస్థితి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ బ్రిడ్జిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తూన పూజితరెడ్డి




**నెల్లూరు రూరల్ ఆగష్టు 17, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకాణి పూజిత రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో శాంతిభద్రతలకు ఎక్కడ ఆటంకం కలగలేదు. మహిళల మాన ప్రాణాలకి భద్రత ఉండేది.కూటమి ప్రభుత్వంలో ఎక్కడ చూసినా మహిళలకు ఆ భద్రత భావం కలుగు తుంది.స్కూళ్లలోగాని,గ్రామాల్లో గాని, పట్టణాల్లో గాని, హాస్పిటల్లో, ఉద్యోగం చేసుకునే ప్రదేశాలలో మ హిళలకు భద్రత లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కంప్లైంట్ చేసినా, మహిళల సమస్యలను పట్టించుకునేం దుకు పోలీసుల దగ్గర టైం లేదు.పోలీసులకు ఎంతసేపటికి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేద్దామా!, ప్రస న్న కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేద్దామా! లేకపోతే ప్రభుత్వ వైఫ్యల్యాలను ప్రశ్నించే వారిపై కేసులు పెడు దామా అనే ఆలోచన తప్ప శాంతిభద్రతలను కాపాడాలనే ఆలోచన రావడం లేదు. కూటమి నేతలు మహిళల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి ఎక్కడైనా మాట్లాడగ లుగు తున్నారా! నెల్లూరులోని కూటమి నాయకులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విగ్ వేసుకున్నారా! వాళ్ళు డై వేసుకున్నారా! లేకపోతే వాళ్ళు ఏ బ్రాండ్ డై వేసుకున్నారు! అలాంటివి ముఖ్యం తప్ప రాష్ట్రం లో మహిళలకు జరుగుతున్న అత్యాచారాలపై మాట్లాడే వారు లేకపోయారు. రాష్ట్రంలో పోలీసులు తీసు కుంటున్న రక్షణ చర్యలు వారిని హింసించే వారిని ఎలా శిక్షి స్తున్నారో చెప్పడం లేదు. కూటమి ప్రభుత్వంలో ఒక ఎమ్మెల్యేనుంచి, టిడిపిలో పనిచేసే ఒక కార్యకర్తకు కూడా రక్షణ లేకుండా పోయింది.కూటమి పార్టీకి సంబంధించిన మహిళలే బయటికి వచ్చి మాపై ఆరాచకాలు జరుగుతున్నాయన్న పట్టించుకునేటువంటి నాధుడే లేదు. జగనన్న పరిపాలనలో ఆ దిశ యప్ ద్వారా మహిళలకు ఆపద కలిగితే వెంటనే చర్యలు తీసుకునేవారు.కూటమి ప్రభుత్వంలో దిశా యాప్‌ను కాపీ కొడుతూ,శక్తి యప్ తీసుకొనివచ్చారు దాని వల్ల మహిళలకు ఉపయోగం లేదు, మహిళలకు రక్షణ కల్పించలేకపోతున్నారు. మహిళలపై ఎన్ని అగాయి త్యాలు జరుగుతున్నా గాని పట్టించుకునేటువంటి అవకాశమే లేదు. ఎంతమంది ఎమ్మెల్యేల మీద మహిళలు ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు పట్టించుకుంటున్నారా! కనీసం విచారణ అయినా జరుగుతుందా! కూటమి ప్రభుత్వపు నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ మహిళల బాధలను సైతం పక్కదోవ పట్టిస్తున్నారు. ఎక్కడ మహిళలు పూజించబడుతారో ఆ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది.కూటమి ప్రభుత్వం మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం డిమాండ్ చేస్తుంది మహిళలపై ఆగాయిత్యాలకు పాల్పడేవారు ఎవరైనా సరే తక్షణమే వారిపై కఠినచర్యలు తీసుకొని మహిళలకు భద్రత కల్పించాలి లేనిపక్షంలో పోరుబాట పడుతాం.

సమావేశంలో ఈ కార్యక్రమంలో జోనల్ మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ , రాష్ట్ర అంగన్వాడి విభాగం కార్యదర్శి వెంకట జ్యోతి , టి.పీ.గూడూరు, పొదలకూరు మండల జడ్పిటిసి సభ్యులు ఎంబేటి శేషమ్మ , తెనాలి నిర్మలమ్మ , ముత్తుకూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గండవరపు సుగుణమ్మ , పొదలకూరు ఎంపీటీసీ లక్ష్మీ ్మ కళ్యాణి, అంగన్వాడి విభాగం జిల్లా అధ్యక్షురాలు పాల లావణ్య, , సర్వేపల్లి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి గారు , నెల్లూరు రూరల్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి , నెల్లూరు సిటీ మహిళా అధ్యక్షురాలు శ్రీ ధనుజ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు

## విధి నిర్వహణలో అంకితభావమే అవార్డుకు మూలం



**కోవూరు ఆగస్టు 17 ప్రభాతవార్త** విధి నిర్వహణలో అంకితభావం చూపుతూ పై అధికారులు ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ప్రభుత్వం ఇస్తున్న పథకాల అమలులో ప్రత్యేకంగా చొరవ తీసుకుంటూ అర్హత కలిగిన లబ్ధిదారులు అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ తీసుకోవడమే కోవూరుఎంపీడీవో సిహెచ్ శ్రీహరి రెడ్డిని స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి నారాయణ చేతుల మీదుగా ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని పొందారు ఆయన ఎన్ఆర్ఈజీఎస్ లో ఏపిడిగా పనిచేసిన ఎంపీడీవో గా పనిచేసిన విధుల పట్ల అంకితభావం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ఆ ఉద్యోగాలకి వన్నె తెచ్చేలా కృషి చేసేవారు అటువంటి వ్యక్తికి స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అవార్డు రావడం పట్ల సహచర ఉద్యోగులు శ్రేయోభిలాషులు ప్రజా ప్రతినిధులు.కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలుసర్వేలు పింఛన్ల పంపిణీలో కూడా ప్రతినెల కోవూరు మండలాన్ని ఒకటి రెండు మూడు స్థానాల్లో ఉండేలా కృషి చేసేవారు ఇందుకు పంచాయతీ కార్యదర్శులు సచివాలయం ఉద్యోగులు కూడా తమ వంతుగా కృషి చేసే వారు. పనిచేసే వ్యక్తికి ఇటువంటి ప్రశంస రావడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పలువురు రిటైర్డ్ ఉద్యో గులు కూడా ఈ సందర్భంగా పేర్కొన్నారు




## భక్తులకు సేవలు అందించి మంచి పేరు తీసుకురావాలి

**- వైభవంగా కామాక్షితాయి మల్లేశ్వర స్వామి ఆలయ చైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం**
**- ఆలయాల సంరక్షణ ధర్మానికి బలం**
**- దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**



**ఇందుకూరుపేట, ఆగష్టు 17, ప్రభాతవార్త** దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆదివారం ఇందుకూరుపేటలోని శ్రీకామాక్షితాయి మల్లేశ్వరస్వామి వారి ఆలయ చైర్మన్‌గా భాస్కర్ నాయుడు, 9 మంది సభ్యులతో కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ప్రశాంతమ్మకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ముఖ్య నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్‌గా తాళ్లూరు భాస్కర్ నాయుడు, 9 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ దాదాపు 100 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ స్వామివారు.. ఇక్కడి ప్రజలను నిత్యం సంరక్షిస్తుంటారని, ఇలాంటి ఆలయ చైర్మన్‌గా, కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా పని చేయాలని ఆమె ఆకాంక్షించారు. స్వామివారి ఆలయం మరింత అభివృద్ధి జరగాలని మనస్ఫూర్తిగా కోరారు. ఆలయాల పరిరక్షణే ధర్మానికి బలమని, ధర్మం ఉన్నంత కాలం, ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. ఆలయాల అభివృద్ధి ద్వారా.. సంస్కృతిని పరిరక్షించుకోవచ్చని, రాబోయే తరాలకు అందించవచ్చన్నారు. మన సంకల్పం ఎంత గొప్పది అయితే.. దేవుడు అంత గొప్పగా సాయం చేస్తాడని చెప్పారు. కూటమి ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.100 కోట్లు కేటాయించిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచారన్నారు. రాష్ట్రంలో దాదాపు 5600 దేవాలయాలకు ఈ నిధులను అందిస్తున్నారని వివరించారు. ఆలయాలలో పని చేసే అర్చకులకు రూ.15వేలు, నాయిబ్రాహ్మణులకు రూ.20వేలు ఇస్తున్నారని, రాష్ట్రంలోని 16 ప్రధాన దేవాలయాలలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కాబట్టి ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు సాగి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ భాస్కర్ నాయుడు, ముఖ్య నాయకులు మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రావిళ్ళ వీరేంద్ర నాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, సూదలగుంట నాగార్జున నాయుడు, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చెంచు కిషోర్ యాదవ్, పముజుల రవి, మాదాల రమేష్ నాయుడు, చెన్నయ్య, దేవస్థాన కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా నెల్లూరు డివిజన్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 17, ప్రభాతవార్త** నెల్లూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ యూనిట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు బి. మురళి, హరిబాబులు ఎన్నికల అధికారులుగా నియమించబడ్డారు. వీరి ఆధ్వర్యంలో జరిగిన నెల్లూరు డివిజన్ యూనిట్ ఎన్నికల్లో ఇందుకూరు పేట తహసిల్దార్ సి హెచ్ గోపికృష్ణ అధ్యక్షులుగా, నెల్లూరు రూరల్ డిప్యూటీ తహసిల్దార్ షేక్. నాసర్ కార్యదర్శిగా నెల్లూరు డివిజన్ యూనిట్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపిక కాబడింది. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టీ పీ గూడూరు డిప్యూటీ తహసిల్దార్ జి. శివయ్య, మొదటి వైస్ ప్రెసిడెంట్‌గా బుచ్చిరెడ్డిపాలెం డిప్యూటీ తహసిల్దార్ బి. భాగ్యలక్ష్మి, రెండో వైస్ ప్రెసిడెంట్‌గా, ఇందుకూరుపేట మండలం సీనియర్ సహాయకులు కే కొండలరావు మూడో వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటాచలం మండలం డిప్యూటీ తహసిల్దార్ పి విజయ్ నెల్లూరు డివిజన్ కార్యదర్శిగా నెల్లూరు రూరల్ మండలం డిప్యూటీ తహసిల్దార్ ఎస్ కే నాసర్ మొదటి జాయింట్ సెక్రెటరీగా నెల్లూరు రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ పనిచేస్తున్న కే మల్లికార్జునరావు, రెండో జాయింట్ సెక్రెటరీగా ముత్తుకూరు తాసిల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబర్డినేట్‌గా పనిచేస్తున్న పవన్, మూడో జాయింట్ సెక్రెటరీగా కోవూరు మండల తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా సి హెచ్ శ్రీనాథ్, కోశాధికారిగా నెల్లూరు రూరల్ మండలం ఎన్నికల ఉప తహసిల్దార్ ఎస్ కే జమీర్, మొదటి ఎగ్జిక్యూటివ్ నెంబర్‌గా పొదలకూరు మండల తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న అశ్వత్ నారాయణ, రెండో ఎగ్జిక్యూటివ్ నెంబర్‌గా నెల్లూరు రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో జూనియర్ నాయకులకు పనిచేస్తున్న ఒద్దిబోయిన సమతా రెడ్డి మూడో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నెల్లూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో జూనియర్ సహాయకులుగా పనిచేస్తున్న పి వినీత్, మొదటి డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ రాపూరు మండలంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ గా పనిచేస్తున్న డి. కవిత రెండో డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ గా బుచ్చిరెడ్డిపాలెం మండలం రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ పనిచేస్తున్న జి వేణుగోపాల్ మూడో డిస్ట్రిక్ట్ కౌన్సిలర్‌గా ముత్తుకూరు మండలం రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ షైక్ జహీర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు జి సతీష్ కుమార్, వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగాయి. ఎన్నిక తదనంతరం ఎన్నిక కాబడిన నూతన కార్యవర్గాన్ని జిల్లా అసోసియేషన్ నాయకులు అల్లంపాటి పెంచల రెడ్డి, కె. డానియల్ పీటర్ రావు, శ్రీకాంత్ రెడ్డి రామకృష్ణులు ఎన్నికల అధికారులను సత్కరించి, నూతన కార్యవర్గంచే అసోసియేషన్ నిబంధనల ప్రకారం ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఎన్నిక కాబడిన కార్యవర్గాన్ని జిల్లా నాయకులు అభినందించారు.

## మహిళలకు ఉచిత బస్సులు ప్రారంబించిన సన్నారెడ్డి సురేష్‌రెడ్డి




**తోటపల్లిగూడూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నాయకుడు హోదాలో చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టడం జరిగింది. సూపర్‌సిక్స్ పథకాలలో ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తోటపల్లిగూడూరు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తోటపల్లిగూడూరు సొసైటీ ప్రెసిడెంట్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా మొన్న జరిగిన ఆగష్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. అలాగే ఈ ఉచిత బస్సు వల్ల మహిళలు ఎంతో ఆనందంగా సంతోషంగా ఉన్నారని ఆయన ఎలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగష్టు 15వ తేదీ ఉచిత బస్సు ప్రవేశపెట్టిన సందర్భంలో తోటపల్లిగూడూరు మండలంలో 17వ తేదీ ఆదివారం ఉదయం మహిళలతో కలిసి ఉచిత బస్సు తోటపల్లిగూడూరు మండలంలో తోటపల్లిగూడూరు సొసైటీ ప్రెసిడెంట్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంగారెడ్డి సురేష్‌రెడ్డి చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి బస్సులను ప్రారంభించారు. ఆయన మహిళలతో పాటు బస్సులో ప్రయాణిస్తూ మహిళలతో ముచ్చడించి ఆధార్ కార్డు చూపిస్తూ మహిళలకు కండక్టర్‌తో కలిసి టిక్కెట్లు ఇచ్చే కార్యక్రమం చేశారు. అలాగే ఉచిత బస్సు సౌకర్యం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళలతో పాటు కొంత దూరం ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సన్నారెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చుకుంటూ ఇప్పుడు మహిళలకు ఇచ్చిన హామీ ఉచిత బస్సు సౌకర్యం కూడా పూర్తి చేయడం చాలా సంతోషదాయకమని కూటమి ప్రభుత్వాన్ని అందూ అబినందిస్తూ మహిళా లోకం అయితే ముఖ్యంగా ఎప్పటికి కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండాలని వారు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. అదే కాక బడుగు, బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో మేలు జరిగిందని అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కుటుంబ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని అందుకే రానున్న సార్వత్రిక ఎన్నికలలో కూడా కూటమి ప్రభుత్వమే అధికారంలోకి రావడం జరుగుతుందని ఆయన జోష్యం చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు పూర్తి స్వేచ్ఛతో జీవిస్తున్నారని ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆయన తెలిపారు. గతంలో పరిపాలించిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం పక్కనపెట్టి కక్ష రాజకీయాలు వేదింపులు అరాచక పాలన చేసి అన్ని వర్గాల ప్రజలను ముప్పతిప్పలు పెట్టి ప్రజల మాన ప్రాణాలకి భద్రత లేకుండా వైసీపీ ప్రభుత్వం పాలన సాగించిందని అందుకే ఈ ప్రభుత్వానికి ప్రతిక్ష హోదా కూడా లేకుండా ప్రజలు చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్మన్ పదవి వంశీకృష్ణారెడ్డికేనా..?



**కోవూరు , ఆగస్టు 17 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఓసీ జనరల్‌కు ఇటీవల కలెక్టర్ జీవో విడుదల చేశారు. ఇప్పటి వరకు ఈ చైర్మన్ పదవిపై కోవూరు నియోజకవర్గ పరిధిలోని విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఈ పదవి రేసులో ఉన్నారు. ప్రస్తుతం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా వంశీకృష్ణారెడ్డికే ఈ పదవి ఇవ్వాలని గట్టి ప్రయత్నాలు చేయడమే కాకుండా ఇటీవల రాఖీ పర్వదినం సందర్భంగా బెజవాడ వంశీకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ పదవి తనకు ఇస్తే రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని చెప్పడం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లా కలెక్టర్ కూడా కోవూరు ఏఎంసీ పదవి ఓసీ జనరల్‌కు కేటాయించడం జరిగింది. దీంతో వంశీకృష్ణారెడ్డి చైర్మన్ పదవికి లైన్ క్లియర్ అయినట్లేనని అందరూ భావిస్తున్నారు.

## తీరు మార్చుకుంటే మీకే మేలు



**కోవూరు , ఆగస్టు 17 ప్రభాతవార్త :** రౌడీలుగా, కేడీలుగా అనుమానితులుగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులకు ఎక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని బుద్ధిగా ఉండాలని ఎస్సై ఖాదర్‌బాషా, అన్నారు. కోవూరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ ఎస్సై మాట్లాడుతూ ఇప్పటికైనా ఇటువంటి కేసుల్లో నిందితులుగా నమోదైన వారు తమ తీరు మార్చుకుని సత్రపవర్తనతో ముందుకు సాగాలన్నారు.

## కళ్యాణానికి రావాలంటూ ఎమ్మెల్యేకు ఆహ్వానం



**కోవూరు , ఆగస్టు 17 ప్రభాతవార్త :** కోవూరులోని లక్ష్మీనగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వా మి దేవస్థానంలో శ్రావణ మాస దశమి పర్వదినం సందర్భంగా కళ్యాణ కార్యక్ర మాన్ని నిర్వహి స్తు న్నా రు.ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు చక్ర వర్తుల అప్పలాచార్యుల స్వామి, టీడీపీనాయకులు బీద భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, తదితరులు కోవూ రు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఈ కళ్యాణ కార్యక్రమానికి రావాలంటూ ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా వారు చెప్పిన విషయాలను పూర్తిగా ఆలకించి వీలు చూసుకుని వస్తానని ఈసం దర్భంగా ఎమ్మెల్యే వారికి తెలియజేశారు.

**- నేడు స్వామివారి కళ్యాణోత్సవం** కోవూరులోని లక్ష్మీ నగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి కళ్యా ణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు 108 కలశాలతో తిరుమంజనం కార్యక్రమాన్ని కూడా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.ఈ కళ్యాణానికి ఉభయకర్తలుగా నెల్లూరు ధనుంజయరెడ్డి, రాజ్య లక్ష్మి, తోటి బ్రహ్మారెడ్డి, లక్ష్మి, నూకల గణేష్ రాజా, హిమబిందు దంపతులు వ్యవహరిస్తున్నారు. ఈ కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల అప్పలాచార్యుల స్వామి ప్రత్యేకంగా చొరవ తీసుకుని భక్తులు, దాతల సహకారంతో ఏర్పాట్లు శరవేగం చేస్తున్నారు.



## మాలిని దేవి ఆసుపత్రిలో సాధారణ కాన్పులో కవలలు

**కావలి, ఆగష్టు18ప్రభాతవార్త** కావలిలోని క్రిష్టియన్‌పేట 5వ లైనులో వున్న మాలిని దేవి ఆసుపత్రిలో ఆపరేషన్ లేకుండా సాధారణ కాన్పులో కవలలు ప్రసవించారు. కావలి రూరల్ మండలం, సిరిపురం పంచాయితీ ,నారాయణపురం గ్రామానికి చెందిన కుంబా నరేంద్ర సతీమణి భువనేశ్వరీ మొదటి కాన్పుకు పురిటి నొప్పులతో మాలిని దేవి ఆసుపత్రిలో చేరారు. హాస్పిటల్ భాధ్యులు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ గోట్టిపాటి మాలినీ దేవి తన వైద్య అనుభవంతో ఎటువంటి ఆపరేషన్ లేకుండా చాకచక్యంగా ఒకే కాన్పులో ఇద్దరు మగ పిల్లల్లను డెలివరి చేయడం జరిగింది. కవల పిల్లలు ఎంతో ఆరోగ్యంగా వున్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరీ కుటుంభసబ్యులు, మరియు పలువురు డాక్టర్ మాలిని దేవికి, వైద్యశాల పిఆర్ఓ మస్తాన్‌కి మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

